క్లుప్తంగా

నిధులు మంజూరు

అర్వపల్లి : మండలంలో వివిధ భవనాల నిర్మాణానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరయ్యాయి. మండలంలోని వేల్పుచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయం సొంతభవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు, కోడూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.12లక్షలు, అర్వపల్లి ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2లక్షలు, తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. త్వరలో వీటి పనులను ప్రారంభించనున్నట్లు పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని పర్సాయపల్లికి చెందిన కుంచం బాలకృష్ణ కుమారుడు అనురిద్‌కు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడటంతో చేయి విరిగింది. ఈ కుటుంబీకులు నిరుపేదలు కావడంతో గ్రామ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పుల భరత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పి.ఎర్రనర్సయ్య, మాజీ ఎంపీటీసీ రాచకొండ గీతసురేష్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పందిరి యుగంధర్, తోట నర్సయ్య, మిర్యాల వెంకన్న, అంకిరెడ్డి లింగయ్య పాల్గొన్నారు.

అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలి

పెన్‌పహాడ్ : అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో టీఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మాదిగలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ప్రతి దళిత కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ప్లేట్లు పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న దాత పడిదల ప్రసాద్

చివ్వెంల : బీబీగూడెం గ్రామానికి చెందిన పడిదల ప్రసాద్ తన తండ్రి పడిదల యల్లయ్య జ్ఞాపకార్థం ఆదివారం గ్రామానికి చెందిన పలువురు చిన్నారులకు ప్లేట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిపుల్స్ ఫౌండేషన్ చైర్మన్ యాతాకుల సునీల్, పడిదల భాగ్యమ్మ, యాతాకుల రుద్రమదేవి, పడిదల చైతన్య, గ్యార నారాయణ, పడిదల శేఖర్, ధక్షశ్రీ, పడిదల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానించకపోవడం హేయమైన చర్య

నాగారం : ఈటూరులో ఆదివారం జరిగిన అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌ల విగ్రహావిష్కరణకు దళిత నాయకులను ఆహ్వానించకపోవడం హేయమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతోపాటు బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి నివాళి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు ఆకుల రాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. అతడి మృతదేహాన్ని పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఖమ్మంపాటి నాగరాజు, ఒగ్గు వెంకన్న ఉన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనులు ప్రారంభం

కోదాడరూరల్ : కాపుగల్లు 1వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు ఇటీవల ఆందోళన చేశారు. దీనికి స్పందించిన అధికారులు, నాయకులు ఆదివారం డ్రెయినేజీ పూడిక తీత పనులను ప్రారంభించారు. అదే విధంగా డ్రెయినేజీ పనులు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే పద్మావతి రూ.3లక్షల నిధులను మంజూరు చేసినట్టు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటాచారి తెలిపారు. కార్యక్రమంలో రేవూరి వెంకటాచారి, ముత్తవరపు మురళీ, మీగడ లింగయ్య, కాసాని అప్పారావు, బొడ్డు వీరబాబు, బాలేబోయిన వెంకటేశ్వర్లు, గోవర్ధన్, అన్నపూర్ణ ఉన్నారు.


పనులు చేయిస్తున్న వెంకటాచారి

లక్ష్యం.. 2.45లక్షల మొక్కలు


కొత్తగూడెంలోని నర్సరీలో విత్తనాలు నాటిన సంచులు


కొత్తగూడెంలోని నర్సరీలో మట్టి జల్లెడ పడుతున్న కూలీలు

- తుంగతుర్తి మండలంలోని ఒక్కో నర్సరీలో 5వేల నుంచి 14 వేల మొక్కల పెంపకం
- 24 నర్సరీల్లో కొనసాగుతున్న పనులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండలంలో చేపట్టనున్న వనమహోత్సవం కార్యక్రమానికి గాను నర్సరీల్లో మొక్కల పెంపకం పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 5వేల నుంచి 14 వేల వరకు మొక్కలు పెంచే విధంగా మండలంలోని 24 నర్సరీలకు లక్ష్యం నిర్దేశించారు. మొత్తం 2.45 లక్షల మొక్కల పెంపకానికి అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. నర్సరీలకు మట్టిని తెప్పించి జల్లెడ పట్టి సంచుల్లో నింపే పనులు జరుగుతున్నాయి. కొన్ని గ్రామపంచాయతీల్లో విత్తనాలను కొనుగోలు చేసి మట్టి నింపిన సంచుల్లో విత్తనాలను నాటే పనులు చేపట్టారు.

నర్సరీల వారీగా ఇలా...

వన మహోత్సవానికి సంబంధించి మొక్కల పెంపకంలో భాగంగా మండలంలోని అన్నారం నర్సరీలో 13,600, బండరామారంలో 11వేలు, బాపన్‌బావి తండాలో 8వేలు, దేవునిగుట్టతండాలో 9వేలు, గానుగుబండలో 12వేలు, గొట్టిపర్తిలో 12వేలు, గుడితండాలో 9వేలు, కొత్తగూడెంలో 8500, కర్విరాలలో 8వేలు, కాశీతండాలో 9వేలు, కేశవాపురంలో 12వేలు, మానాపురంలో 9500, మంచతండాలో 9వేలు, రామన్నగూడెంలో 10వేలు, రావులపల్లిలో 12వేలు, రావులపల్లి ఎక్స్‌రోడ్డు తండాలో 9వేలు, సంగెంలో 11,400, సింగారంతండాలో 9వేలు, సూర్యతండాలో 8వేలు, తుంగతుర్తిలో 12వేలు, తూర్పుగూడెంలో 12వేలు, వెలుగుపల్లిలో 12వేలు, వెంపటిలో 12వేలు, ఏనెకుంటతండాలో 7,985 చొప్పున మొత్తం 2.45లక్షల మొక్కలు పెంచనున్నారు. కాగా ఇప్పటికే అన్ని నర్సరీలకు ఎర్ర, నల్ల మట్టిని తెచ్చి జల్లెడ పట్టి సంచుల్లో నింపారు. కొన్ని నర్సరీల్లో మట్టి సంచుల్లో విత్తనాలు నాటే పనులు కొనసాగుతున్నాయి.

నర్సరీల వారీగా లక్ష్యం



తుంగతుర్తి మండలంలో మొత్తం 2.45లక్షల మొక్కలు పెంచాలని 24 గ్రామ పంచాయతీల్లో ఉన్న నర్సరీలకు లక్ష్యాన్ని నిర్దేశించాము. జీపీల వారీగా ఎన్ని మొక్కలు పెంచాలనేది నిర్ణయించాం. వచ్చే వన మహోత్సవానికి నర్సరీలలో సంచుల్లో మట్టి నింపే పనులు, విత్తనాలు నాటే పనులు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో విత్తనాలు నాటే పనులు పూర్తిచేస్తాం.

– శేషుకుమార్, ఎంపీడీఓ, తుంగతుర్తి

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఉద్యమకారులు

తుంగతుర్తి : మలిదశ తెలంగాణ ఉద్యమకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం వ్యవస్థాపకుడు సామ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యమకారులకు 250 గజాల్లో ఇల్లు కట్టించి ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు ఎలగందుల మల్లేష్‌నేత, సగ్గం మల్లయ్య, కొత్తగట్టు యాకయ్య, సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, కొత్తగట్టు యాకయ్య, సాయి, శంకర్, నాగమల్లు, వెంకటేష్, అఖిల్, రాములు, సోమయ్య, చాంద్‌పాషా, దాదాగిరి, ఉపేందర్, విజయ్, యాకయ్య, రాజు, కిరణ్, వీరనారి, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, ఇంద్రసేనారావు, రామ్మూర్తి, భాగ్యమ్మ, భూపాల్‌రెడ్డి, సంజీవ, సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


పర్సాయపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీఓ గోపి

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారంతా ఇళ్ల వద్ద అందుబాటులో ఉండి సర్వే సిబ్బందికి సహకరించాలని మండల పంచాయతీ అధికారి టి. గోపి కోరారు. మండలంలోని పర్సాయపల్లి, జాజిరెడ్డిగూడెం, వేల్పుచర్ల, సీతారాంపురం, అర్వపల్లి, రామన్నగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ప్రజాపాలనలో 9,070 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 7 వేల ఇళ్ల సర్వే పూర్తయిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు స్రవంతి, నవీన్‌రెడ్డి, నెహ్రూ నాయక్, దస్తగిరి, కృష్ణవేణి, నాగయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి మిత్ర మండలి వార్షికోత్సవం


నూతన కమిటీ సభ్యులు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో నల్లగుంట్ల అయోధ్య అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థి మిత్ర మండలి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లికార్జున్ మాట్లాడారు. గత సంవత్సర కాలంలో మిత్ర మండలి చేపట్టిన సామాజిక, ప్రజాహిత సేవా కార్యక్రమాల నివేదికను సభకు సమర్పించారు. విద్యార్థులకు మొబైల్ వల్ల లాభ-నష్టాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా వై.నర్సయ్య, అధ్యక్షుడిగా నల్లగుంట్ల అయోధ్య, ఉపాధ్యక్షుడిగా నల్లపాటి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా బయ్యా మల్లికార్జున్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ సైదులు, జాయింట్ సెక్రటరీగా మాధంశెట్టి నాగేశ్వరరావు, అదనపు సెక్రటరీగా సట్టు వెంకన్న, కల్చరల్ సెక్రటరీగా గుండ్ల కొమురయ్య, పబ్లిసిటీ సెక్రటరీగా తన్నీరు యాదగిరి, కోశాధికారిగా గీసారాంచందర్, కార్యదర్శి వర్గ సభ్యులుగా అంబాలమ్మ, నూకల లక్ష్మి, ఆరోన్, వెంకన్న, సుందరయ్య, షేక్ ఇక్బాల్ పాషా, చంద్రమౌళి, బట్టిపల్లి వెంకన్నల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతనం నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

మహాసభను విజయవంతం చేయాలి


ప్రచార యాత్రలో పాల్గొన్న సీపీఐ నాయకులు

నూతనకల్ : నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించే సీపీఐ మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార జీపు యాత్రలో పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిందని ఆయన తెలిపారు. పేదల పక్షాన పార్టీ ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని పేర్కొన్నారు. మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్, సృజన, మల్లేష్, మద్దెల రామ్మూర్తి, యానాల వెంకట్‌రెడ్డి, లింగయ్య, రవి పాల్గొన్నారు.

ఉండ్రుగొండ ఆలయంలో రుద్రాభిషేకం


రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : మార్గశిర మాస శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీఉమామహేశ్వర స్వామి వారికి ఆదివారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు బ్రహ్మశ్రీ మంత్రమూర్తి మనోహర శర్మ మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు


తుంగతుర్తి : పూజలు చేస్తున్న భక్తులు


జాజిరెడ్డిగూడెం దేవాలయంలో..

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదాదేవికి మంగళహారతులతో పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల లో భాగంగా ఆదివారం మహిళలు గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు 14వరోజు పద్నాలుగవ పాశురాన్ని పఠించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చారు. భక్తులు సూర్యోదయానికి ముందే స్వామికి నివేదన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని గోరెంట్ల గ్రామానికి చెందిన 1987–1988 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రంగారెడ్డి, ఉపాధ్యాయులు క్రిష్టారెడ్డి, మన్సూర్ అలీ, అటెండర్ సోమరాజు, పూర్వ విద్యార్థులు ఎర్రంశెట్టి ఇందిర, బద్దం అమృతారెడ్డి, ఎలిమినేటి రాంమోహన్, చిదిరాల శ్రీనివాస్, బద్దం వెంకట్‌రెడ్డి, వెంకటరమణ, తాళ్లపెల్లి మల్లేష్, ఏనుగుతల శ్యాంబాబు, నాగేశ్వర్‌రావు, లింగారెడ్డి, రేణుక, చాంద్ బేగం, పద్మ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : రానున్న నూతన సంవత్సరం సందర్భంగా సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ జి.అజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఆకర్షణీయమైన న్యూ ఈయర్ గ్రీటింగ్స్ అంటూ వాట్సప్, టెలీగ్రామ్ గ్రూపులలో లింక్‌లు వస్తుంటాయని, తొందరపడి క్లిక్ చేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దని తెలిపారు. జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



తిరుమలగిరిలో టీ తాగుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్


తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సామేల్‌ను సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. ఆదివారం తిరుమలగిరిలో ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డితో కలిసి సాదా సీదాగా చాయ్ తాగుతూ స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే, ఎంపీతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, సుధాకర్, వంశీ, కిష్టునాయక్, సోమనర్సయ్య, మల్లయ్య, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలి

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్వపల్లికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్యే మందుల సామేల్‌కు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ విన్నవించారు. తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఫిబ్రవరిలో జరిగే స్థానిక శ్రీయోగానందస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఈదుల రమేష్‌చంద్ర, మాజీ ఉపసర్పంచ్ పులిచర్ల ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయిని మనోహర్, మేడి సంపత్, ఆకిటి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం


కాలిబూడిదైన గుడిసె

ఆత్మకూర్ (ఎస్): షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం కాశీగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని తెట్టెకుంటతండాలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెట్టెకుంటతండాకు చెందిన బదావత్ రాంకోటి తన కుటుంబంతో కలిసి గుడిసెలో నివాసముంటున్నాడు. ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం రాంకోటి బావి వద్దకు వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి గుడిసెకు మంటలు అంటుకున్నాయి. చుట్టుపక్కల వారు గమనించి రాంకోటికి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బందికి వచ్చేసరికి చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.3.80లక్షల నగదు, సామగ్రి, పట్టాదారు పాసుపుస్తకం, రాంకోటి కుమారుల సర్టిఫికెట్లు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.6లక్షల వరకు నష్టం వాటిల్లిందని స్థానికులు పేర్కొంటున్నారు.

సూర్యనారాయణస్వామి క్షేత్రంలో పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, ఇంద్రారెడ్డి, అర్చకులు భీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ స్టోర్ సందర్శన

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు రిటైల్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఆదివారం కోదాడ పట్టణంలోని బజాజ్ ఎలక్ట్రానిక్ స్టోర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సాయి ఈశ్వరి మాట్లాడారు. పారిశ్రామిక పర్యటనలతో విద్యార్థులు అంశాలను సులభంగా అర్థం చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో వృత్తి విద్య ఉపాధ్యాయులు మధు, విజయవాణి, పరశురామ్, అంబేద్కర్, పిచ్చయ్య, వ్యాయామ అధ్యాపకుడు నాగయ్య పాల్గొన్నారు.

చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని వినతి

పాలకవీడు : జాన్‌పహాడ్ చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్వి.సుబ్బారావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ఐడీసీ డీఈ నవీకాంత్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ ఆయకట్టు చివరి ప్రాంతమైన జాన్‌పహాడ్, కల్మెట్‌తండా, దర్గా, చెరువుతండా, కొత్తతండా గ్రామాలకు ఏటా తాగు, సాగునీటి కష్టాలు తప్పడంలేదని వివరించారు. సమస్య పరిష్కారానికి కృష్ణానదిపై ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ద్వారా చెరువుకు నీటిని తరలించాలని, చెక్‌డ్యాంకు మూసీ నది నుంచి లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పుట్ట వెంకటేశ్వర్లు, కూరపాటి కోటయ్య, కాటూరి పుల్లారావు, నాగండ్ల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, సైదామస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరసింహారావు

కోదాడరూరల్ : రాష్ట్ర చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా కోదాడకు చెందిన కొంగర నరసింహారావు నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన చేనేత ఐక్యవేదిక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతోపాటు కోదాడ నియోజకవర్గానికి చెందిన మరికొందరికి జిల్లా కార్యవర్గంలో చోటు దక్కింది. జిల్లా ప్రచార కార్యదర్శిగా గౌరై రాజేష్, కార్యదర్శులుగా పిచిలక కోటయ్య, కనకయ్య, చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నా రు. వారిని రాష్ట్ర కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో సన్మానించారు.

అన్నదానం అభినందనీయం

కోదాడరూరల్ : పదకొండేళ్లుగా మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు రాజీదేశ్‌పాండే అన్నారు. ఆదివారం పట్టణంలోని హుజూర్‌నగర్‌రోడ్‌లోని గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో అర్వపల్లి సత్యనారాయణ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న దాతలు

ముమ్మరంగా రహదారి విస్తరణ పనులు


తిమ్మాపురం సమీపంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు


కొమ్మాల-కోడూరు మధ్య పూర్తయిన కల్వర్టు

అర్వపల్లి : మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే తిమ్మాపురం-సంగెం-నూతనకల్ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, నూతనకల్ మండలాల ప్రజలు రాకపోకలు సాగించే ఈ రహదారి తిమ్మాపురం నుంచి నూతనకల్ వరకు 22కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారి విస్తరణను రూ.32 కోట్లతో చేపడుతున్నారు. విస్తరణలో భాగంగా ఇప్పటికే ఈ రహదారిపై 35 వరకు కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. మిగిలిన వాటి పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్డు ప్రస్తుతం 24 ఫీట్ల వెడల్పు ఉండగా 30 ఫీట్లకు పెంచుతున్నారు. ప్రస్తుతం పూర్తిగా సీడీ పనులు చేస్తున్నారు. ఇవి పూర్తయ్యాక బీటీ పనులు మొదలు కానున్నాయని నాగారం, తుంగతుర్తి సబ్ డివిజన్ డీఈలు బాబూరావు, లింగానాయక్ తెలిపారు.

కూచిపూడిలో మట్టి రవాణా టిప్పర్ల అడ్డగింత


కూచిపూడి గ్రామస్తులు అడ్డుకున్న టిప్పర్లు

కోదాడరూరల్ : కూచిపూడి శివారులోని ప్రభుత్వ భూమి నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్తులు అడ్డుకుని ఆందోళనకు దిగారు. విషయాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలపడంతో వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మట్టి వ్యాపారులు టిప్పర్‌లు, ప్రొక్లెయిన్‌లను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 542, 543, 544లోని ప్రభుత్వ ఏనెలు, గుట్టల నుంచి వారం రోజులుగా కొంతమంది ఇష్టానుసారంగా మట్టిని తవ్వి టిప్పర్‌లలో తరలించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ గుట్టలను కాపాడాలని కోరారు.